ప్రజాశక్తి

శనివారం 21 డిసెంబర్ 2024

5

అనంతపురం



మాతాశిశు మరణాల నియంత్రణే లక్ష్యం

ఎడిఎంహెచ్ఒ సుజాత

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏటేటా ప్రసవాల సంఖ్యను పెంచడంతో పాటు మాతాశిశు మరణా లను తగ్గించాలని అడిషనల్ డిఎంహెచ్ఒ సుజాత ఆదేశించారు. స్థానిక పిహెచ్‌సిలో శుక్రవారం వైద్యాధికారి రాజేష్‌కుమార్, ఆఫ్తాబ్ ఆధ్వర్యంలో సూపర్వైజర్లు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పి, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ఉన్న ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు సక్రమంగా అందించాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాల న్నారు. ప్రత్యేకంగా మాతాశిశు సంరక్షణపై శిక్షణ తరగతులు నిర్వహించారు. రికార్డులను పరిశీలిం చారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ కార్యాలయ స్టాటిస్టికల్ అధికారి మహమ్మద్ రఫీ, పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ రాజేష్‌కుమార్, డాక్టర్ అఫ్తాబ్, సూపర్‌వైజర్లు మేరీ, రామలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

"హిందూపురం తూమకుంట పారిశ్రామిక వాడలోని శ్యాం ఫెరస్ అలైస్ స్టీల్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ ఇర్ఫాన్ ప్రమాదశాత్తు క్రేన్ మీద నుంచి కిందకు పడి, తీవ్ర గాయాలు అయ్యి కోమాలోకి వెళ్లాడు.

"తూముకుంట పారిశ్రామిక వాడలోని మహర్షి స్టీల్స్‌లో కర్నాటక రాష్ట్రం గౌరిబిదనూరుకు చెందిన ఓ కార్మికుడు వెల్డింగ్ పని చేస్తూ షార్ట్ సర్క్యూట్‌తో సంఘటన స్థలంలోనే మరణించాడు".

"గత జూన్ నెలలో తూమకుంట పారిశ్రామిక వాడలోని రోల్ వెల్ పరిశ్రమలో విధి నిర్వహణలో ఉన్న కొటిపికి చెందిన కార్మికుడు లక్ష్మినారాయణ ఉన్నఫలంగా పరిశ్రమలోనే మరణించాడు. ఈ విషయం బయటకు రానివ్వకుండా పరిశ్రమ యాజమాన్యం లోగుట్టు వ్యవహారం నడిపింది".

"రెండు రోజుల క్రితం అనంతపురం జిల్లా యాడికి మండలం బోయరెడ్డిపల్లి గ్రామంలోని ఆదానీ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో శివకేశవ అనే కార్మికుడు మరణించాడు. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు".

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలు.. వాటిలో మరణిస్తున్నా, గాయపడిన ఘటనలకు సంబంధించిన కొన్ని ఉదాహరణలు ఇవి. ఇలా ఒక్క మహమ్మద్ ఇర్ఫాన్, లక్ష్మినారాయణ, శివకేశవ కాదు ఎంతో మంది స్థానిక, వలస కార్మికుల ప్రాణాలు పరిశ్రమల్లో గాల్లో కలుస్తున్నాయి. పని ప్రదేశంలో సరైన రక్షణ లేకపోవడంతో కార్మికుల ప్రాణాలు గాల్లో దీపంలా మారుతున్నాయి. విషవాయువుల లీకేజీ, రియాక్టర్లు, బాయిలర్లలో పేలుళ్లు, ఎగిసిపడుతున్న అగ్నికీలలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వరుస పారిశ్రామిక ప్రమాదాలు కార్మికుల జీవితాల్లో చీకట్లు నింపుతున్నాయి. పనిచేస్తే తప్పా కుటుంబం గడవని నేపథ్యంలో కార్మికులు గత్యంతరం లేక ప్రాణాలు అరచేతపట్టుకుని నిత్యం ప్రాణభయంతో పనులు చేయాల్సి వస్తోంది. కార్మికులకు రక్షణగా ఉండాల్సిన సంబంధిత అన్ని శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ కాలం గడిపేస్తున్నారు.

ప్రమాదం..అనునిత్యం..!



ప్రజాశక్తి-హిందూపురం

ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులు ఉపాధి నిమిత్తం హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురంతో పాటు ఉమ్మడి జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమల్లో పనిచేసేందుకు వస్తున్నారు. ముఖ్యంగా హిందూపురం ప్రాంతంలో రసాయన పరిశ్రమలు, ప్లాస్టిక్, ఇంజినీరింగ్, ఐరన్, గ్రానైట్ తదితర పరిశ్రమలు ఉండడంతో వందలాది మంది ఉపాధి పొందుతున్నారు. పరిశ్రమల్లో భద్రతా చర్యలను తీసుకోవడంలో యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణనష్టం కూడా పరిపాటే అయింది. పొట్టకూటి కోసం వచ్చిన వారు ప్రమాదాలకు బలైపోతున్నారు. పరిశ్రమల్లో తరచూ తనిఖీలు చేసి కార్మికుల భద్రత కోసం చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు ఎక్కడా కనిపించడం లేదు. దాంతో కార్మికుల కోసం కనీసం భద్రతా ప్రమాణాలను పరిశ్రమలు పాటించడం లేదు. యంత్రాల వద్ద పనిచేసే కార్మికులకు కూడా రక్షణ పరికరాలను సైతం సమకూర్చడం లేదు. మరోపక్క అనుభవం ఉన్న కార్మికులను విధుల్లో పెట్టుకుంటే ఎక్కువ వేతనాలు ఇవ్వాల్సి వస్తుందనే దురుద్దేశంతో ఏమాత్రం అనుభవం లేని కార్మికులను పనిలో పెట్టుకోవడంతో ప్రమాదాలు జరిగి మతి చెందుతున్నారు. కార్మికులకు రక్షణ పరికరాలను ఇవ్వకపోవడం, యంత్రాల పనితీరుపై అవగాహన లేకపోవడంతో.. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోతున్నారు. ఎంతోమంది శరీర అవయవాలు కోల్పోయి అవిటివారిగా కూడా మారుతున్నారు. ప్రమాద విషయాలను చాలావరకు సంబంధిత పరిశ్రమల యాజమాన్యాలు ఏమాత్రం బయటకు పొక్కనీయడం లేదు. బాధితులకు ఎంతోకొంత ముట్టజెప్పి చేతులు దులిపేసుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.



శ్యాం ఫెరస్ అలైస్ స్టీలు పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ గాయపడి కోమాలోకి వెళ్లిన మహమ్మద్ ఇర్ఫాన్



ప్రమాదంలో గాయపడిన సోమనాథ్ (ఫైల్ ఫొటో)

◆ పరిశ్రమల్లో కార్మికులకు భద్రత కరువు

◆ రక్షణను విస్మరిస్తున్న యాజమాన్యాలు

◆ పర్యవేక్షణ మరచిన అధికార యంత్రాంగం

◆ ఘటన జరిగితే ఓ రెండు రోజులు హడావుడితో సరి

కర్నాటకలో చికిత్సలు

హిందూపురం సమీపంలోని పారిశ్రామిక వాడల్లో ప్రమదాలు జరిగినప్పుడు స్థానికంగా ఉన్న ప్రభుత్వ అసుపత్రికి తీసుకొస్తే ప్రమాద సంఘటన బయటకు వస్తోందని భావించి కర్నాటక రాష్ట్రం గౌరిబిదనూరులోని ఓ ప్రవేటు అసుపత్రికి తీసుకెళ్లి వైద్య చికిత్సలను అందిస్తున్నారు. ప్రమాదంలో మరీ ఎక్కువగా కార్మికులు గాయపడితే వారికి తూతూమంత్రంగా చికిత్సలను చేయించి, చేతులు దులుపుకుంటున్నారు. ప్రతి నెలా ఆ అసుపత్రికి హిందూపురం స్టీల్ తదితర పరిశ్రమల వారు వేలాది రూపాయాలు చెల్లిస్తున్నారంటే ఎంత కార్మికులకు అక్కడ చికిత్సలు చేయిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

హడావుడితో అధికారులు సరి..!

పరిశ్రమల్లో ప్రమాద విషయం బయటకు వచ్చి పత్రికల్లో వార్తలు వస్తేగానీ అధికారుల్లో చలనం రావడం లేదు. తనిఖీలు, పరిశీలన పేరుతో అధికారులు రావడం.. యజమానులు ఇచ్చే విందును ఆరగించడం... ఇచ్చిన మాముళ్లు పుచ్చుకుని వెళ్లి పోవడం... పరిపాటిగా మారిందనే ఆరోపణలున్నాయి. హిందూపురం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలే కాదు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని పరిశ్రమల్లోనే ఈ తంతు సర్వ సాధరణమనే విమర్శలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేమి నిర్వాహకులకు వరంగా మారింది. ఎప్పుడైనా ప్రమాదాలు జరిగితే నామమాత్రం పరిహారం ఇచ్చి చేతులు దులుపేసు కుంటున్నారనే విమర్శలూ వినిపిస్తున్నాయి. ఇక కార్మికుల భద్రత కోసం ఉన్న చట్టాలు పరిశ్రమల్లో మచ్చుకైనా అమలుకునోచు కోవడం లేదు.



ఉక్కు పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించిన ప్రదేశం (ఫైల్ ఫొటో)

యాజమాన్యాల నిర్లక్ష్యం

పరిశ్రమల లాభాపేక్ష, ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్లే పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వలస కార్మికులు చనిపోతే అత్యంత గోప్యంగా వారి మృతదేహాలను యాజమాన్యాలు తరలిస్తున్నాయి. అధికారులు కనీస పర్యవేక్షణ లేకపోవడం అత్యంత విచారకరం.

ఈఎస్.వెంకటేష్ సిఐటియు జిల్లా కార్యదర్శి.

ధనార్జనే పరిశ్రమల వైఖరి

తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలోని వివిధ పరిశ్రమల్లో భద్రత ప్రణామాలు పాటించడం లేదు. ధనార్జనే ధ్యేయంగా పరిశ్రమ యాజమాన్యాలు పనిచేస్తున్నాయి. ప్రమాదాలు జరగకుండా భద్రతా అధికారులు ఎప్పటికప్పుడు పరిశ్రమలను పర్యవేక్షించి చర్యలు చేపట్టాలి.

రవికుమార్, తూమకుంట కార్మిక సంఘం అధ్యక్షులు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

మత్తుపదార్థాలను పూర్తిగా నియంత్రిద్దాం

ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోకు మత్తు పదార్థాలు రవాణా కాకుండా విశాఖపట్నం నుంచి వచ్చే రైళ్లు, బస్సులు అన్ని ప్రయివేటు వాహనాలపై గట్టి నిఘా ఉంచాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్‌సిఒఆర్‌డి జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని అడిషనల్ ఎస్పీ డివి.రమణమూర్తితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ఉపయోగించకుండా ప్రతి పాఠశాల, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. జిల్లాకు గంజాయి రాకుండా సరిహద్దుల్లో గట్టి నిఘా ఉంచాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో కార్గో బుకింగ్ చేసే వస్తువులపైనా నిఘా ఉంచాలన్నారు. అనుమానితులను ఎప్పటికప్పుడు విచారణ చేయాలని పోలీసులకు సూచించారు. అడిషనల్ ఎస్పీ డివి.రమణమూర్తి మాట్లాడుతూ నవంబర్ 16 నుంచి డిసెంబర్ 19 వరకు గంజాయికి సంబంధించి ఒక కేసు నమోదయిందని, నలుగురు నిందితులలో ముగ్గురిని రిమాండ్‌కు పంపి వారి నుంచి 1.521 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వీటిపై గట్టి నిఘా ఉంచామని తెలియజేశారు. ఈ సమావేశంలో డిఆర్ఒ ఎ.మాలోల, అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావుతో పాల్గొన్నారు.



సైలెన్సర్లను రోడ్డుపై వేసి రోడ్డు రోలర్‌తో తొక్కిస్తున్న ఎస్పీ జగదీష్

వాహన శబ్దాలపై పోలీసు కొరడా

భారీ శబ్దాలు చేస్తే చర్యలు తప్పవు : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

రోడ్లపై భారీ శబ్దాలు చేస్తూ ద్విచక్రవాహనాలు నడిపే వారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు అనంతపరం నగరంలోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న 110 టూవీలర్ల సైలెన్సర్లను శుక్రవారం స్థానిక క్లాక్ టవర్ సమీపంలో రోడ్డు రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ మోటారు వాహనాల చట్టం నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాలకు కంపెనీ సైలెన్సర్లు కాకుండా వాటి స్థానంలో భారీ శబ్దం వచ్చే సైలెన్సర్లు బిగించుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు కంపెనీ ఇచ్చే సైలెన్సర్లను మాత్రమే ఉపయోగించాలని వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ వి.శ్రీనివాసరావు, సిఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

జెసిబితో గుంత పూడ్చివేత పనులు



రోడ్డుపై మట్టి తొలగింపు

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని పాతపేట సచివాలయం-2 వద్ద రోడ్డు పక్కన నెట్ కేబుల్ వైర్ తెగిపోవడంతో ఓ ప్రయివేటు కంపెనీ మరమ్మతుల కోసం గుంతలు తీసింది. గుంతతీసిన మట్టిని రోడ్డుపై వేయడంతో అటుగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ సమస్యపై ప్రజాశక్తితో పాటు పలు పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఈ సమస్య పరిష్కారంపై అధికారులు ఏ మాత్రం స్పందించకపోవడంతో జర్నలిస్టు హనుమంతు శుక్రవారం తన సొంత ఖర్చుతో రోడ్డుపై ఉన్న గుంతలను మట్టితో పూడ్చి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

వెన్నపూసపల్లిలో రెవెన్యూ సదస్సు

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని వెన్నపూసపల్లి గ్రామంలో తహశీల్దార్ రాజ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయకట్టు కాలువకు సంబంధించిన పలువురు రైతులు సమస్యలపై అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐ సత్యబాబు, ఎఎస్ఐ సంపత్, ఆర్ఐ చిన్ననారాయణమ్మ, మండల సర్వేయర్ షర్వాణి పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు చేపట్టాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆగిన మున్సిపల్, నగరపాలక ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులను నిర్వహించాలని ఎస్‌టియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈవో ప్రసాద్‌బాబును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌టియు అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి రామాంజనేయులు, శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మున్సిపల్, నగర పాలక సంస్థ పాఠశాలల్లో వివిధ ఖాళీలను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఆదేశించినా ఉమ్మడి అనంతపురం జిల్లాలో వివిధ రకాల కారణాలతో ఆ ప్రక్రియ ఆగిందన్నారు. వెంటనే పదోన్నతులను మొదలు పెట్టి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంతో ఎస్‌టియు నాయకులు సూర్యుడు, ఫణిభూషణ్, అజయ్ కుమార్, నగర నాయకులు మల్లికార్జున, గంగాధర్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వాస్తవిక దృక్పథానికి నిలువుటద్దాలు

◆ 'రాంభూపాల్' పుస్తకాలపై వక్తలు ◆ మూడు పుస్తకాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



రాంభూపాల్ రచించిన మూడు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

సమాజంలోని నేటి వాస్తవిక దృక్పథానికి అద్దం పట్టే విధంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ రచనలు ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. వి.రాంభూపాల్ రచించిన మూడు పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని అనంతపురం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణంలోని డిపిసి సమావేశం హాలులో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్ఎం.బాషా అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. 'రైతులను ముంచుతున్న పాలకుల విధానాలు' అన్న పుస్తకాన్ని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ ఆవిష్కరించారు. 'విద్వేష రాజకీయాలు' పుస్తకాన్ని కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. 'అసమానతలు ఆర్థిక విధానాలు' పుస్తకాన్ని ప్రముఖ బడ్జెట్ విశ్లేషకులు బోస్ ఆవిష్కరించారు. డా॥గేయానంద్ మాట్లాడుతూ జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులతోపాటు, వ్యవసాయ సంక్షోభంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అత్యంత అద్భుతంగా ఆయన రచనల్లో కనబరిచారని తెలిపారు. ఇది నేడు జిల్లాలో నెలకొన్న వాస్తవిక పరిస్థితులను తెలియజేసేవిగా ఉన్నాయన్నారు. ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పాలకులు నేడు ప్రజల మధ్య విభజన తీసుకొస్తున్న పరిస్థితులను రాంభూపాల్ తన రచనల్లో స్పష్టంగా తెలియజేసారన్నారు. పాలకులు మారినంత మాత్రాన ప్రయోజనం లేదని, విధానాలు మారనంత వరకు ప్రజల జీవితాల్లో మార్పు రాదన్న విషయాన్ని ఆయన చక్కగా వివరించే ప్రయత్నం చేసారన్నారు. బడ్జెట్ విశ్లేషకులు బోస్ మాట్లాడుతూ దేశంలో నెలకొన్న ఆర్థిక అసమానతలను నిర్దిష్టంగా సరళంగా అందరికీ అర్థమయ్యే విధంగా ఆయన రచనలున్నాయని పేర్కొన్నారు. ఆయన రచనల్లో వాడిన భాష కూడా చాలా సరళంగా ఉందని చెప్పారు. సీనియర్ న్యాయవాది రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఒక్క అడుగు ముందుండాలి అన్న లెనిన్ చెప్పిన విషయాన్ని ఆయన తెలియజేశారు. ప్రజలను చైతన్య వంతం చేసే విధంగా రాంభూపాల్ రచనలున్నాయన్నారు. సిపిఐ రాష్ట్ర నాయకులు జగదీశ్ మాట్లాడుతూ జిల్లా కార్యదర్శిగా ఉంటూ ప్రస్తుత పరిస్థితులపై రచనలు సాగించడం కష్టతరమైన విషయం అయినా రాంభూపాల్ రచనలు చేయడం అభినందనీయమన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసి నాయకులు ఏసురత్నం మాట్లాడుతూ ప్రజా సమస్యలను అందరికీ తెలియజేసే ప్రయత్నం చేయడాన్ని కొనియాడారు. సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబుళు మాట్లాడుతూ ముందు నుంచి సామాజిక పరిస్థితులను అధ్యయనం చేయడం, సరైన పద్ధతుల్లో విశ్లేషణ చేసి అందరికీ అర్థమయ్యే విధంగా చెప్పడంలో రాంభూపాల్ కృషి అభినందనీయమన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ తాను సాగించిన రచనల్లో అందరి సహకారం,తోడ్పాటు ఉందని చెప్పారు. జిల్లాలో ఉన్న పరిస్థితులే అవగాహన కల్పించాయన్నారు. తన రచనలు పార్టీ ఉమ్మడి అభిప్రాయమేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, సావిత్రి, నగర కార్యదర్శి వి.రామిరెడ్డి పాల్గొన్నారు.

సుపథం టికెట్ల అక్రమాలపై విచారణ చేపట్టాలి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-ఉరవకొండ

తిరుమలలో కొందరు దళారులు తన సిఫార్సు లేఖను ఉపయోగించి సుపథం టికెట్లను భక్తులకు అమ్ముకున్నట్లు జరుగుతున్న ప్రచారం తనను తీవ్ర ఆవేదనకు గురి చేసిందని శాసనమండలి ప్రివిలైజ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నా నియోజక వర్గంలో కార్యకర్తలు వారి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లడానికి విఐపి, బ్రేక్, సుపథం టికెట్ల సిఫార్సు లేఖలు ఇస్తుంటానే తప్ప ఇక ఎలాంటి దుర్వినియోగానికి తావులేదన్నారు. నా సిఫార్సు లేఖ దుర్వినియోగమై నట్లు వార్తలు వచ్చాయని, దుర్వినియోగానికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు ఎమ్మెల్సీ స్పష్టం చేశారు.

వృద్ధులను విస్మరిస్తే చర్యలు

పెద్దవడుగూరు : వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాధ్యత కన్నబిడ్డలదేనని, వారిని విస్మరిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. గుత్తి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త రంగనాథ రావు సహకారంతో శుక్రవారం గుత్తి కోట పరిక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్ ఆధ్వర్యంలో పెద్దవడుగూరులోని గాంధీ కూడలిలో 80 మంది వృద్ధులు, దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ వృద్ధులకు రక్షణగా ఉన్న చట్టాలను వివరించారు. కార్యక్రమంలో ఎస్కేయు ప్రొఫెసర్ పద్మ, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు ఎద్దుల సూర్యనారాయణరెడ్డి, సర్పంచి వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

404, 405 జీవోలను రద్దు చేయాలి

◆ వాటితో హంద్రీనీవా ప్రాజెక్టు ప్రయోజనాలకు విఘాతం

◆ ఉమ్మడి అనంత జలసాధన సమితి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

మాల్యాల నుంచి జీడిపల్లి వరకు 3850 క్యూసెక్కుల కాలువ వెడల్పు చేసేందుకు జీడిపల్లి నుంచి కాలువ లైనింగ్ చేయటానికి ఎన్‌డిఎ చంద్రబాబు ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోలు 404, 405లను రద్దు చేయాలని జలసాధన సమితి ఉమ్మడి అనంతపురం జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హంద్రీనీవా చీఫ్ ఇంజనీర్ ఆఫీస్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ ధర్నా కార్యక్రమానికి జలసాధన సమితి అధ్యక్షులు రామకుమార్ అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తలుగా మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్, సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సాగునీటి రంగ నిపుణులు ఎస్ఎం.బాషా, రచయిత శాంతి నారాయణ హాజరై మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలు హంద్రీనీవా ప్రాజెక్టు ప్రయోజనాలకు విఘాతం కలిగించే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రజలకు తీవ్ర నష్టం కలగజేసే ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం రాయలసీమ నాలుగు జిల్లాలలో ఆరు లక్షల ఎకరాలకు ప్రధానంగా అనంతపురం జిల్లాలో 3,45,000 ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే విధంగా రూపకల్పన చేశారని తెలిపారు. దీనికి విరుద్ధంగా చంద్రబాబు ప్రభుత్వం జీవోలు విడుదల చేయడం దుర్మార్గం అన్నారు. హంద్రీనీవా ప్రధాన ఉద్దేశం నెరవేరాలంటే మాల్యాల నుంచి జీడిపల్లి వరకు పదివేల క్యూసెక్కులతో జీడిపల్లి నుంచి గొల్లపల్లి వరకు 6000 అక్కడ నుంచి మారాల వరకు 5000 క్యూసెక్కులు, మారాల నుంచి చెర్లోపల్లి వరకు 4500 క్యూసెక్కులు కాలువ వెడల్పు చేయాలన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు 1500 క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలన్నారు. కష్ణా నది నుంచి తెచ్చుకున్న నీటిని నిల్వ చేసుకోవడానికి అవసరమయ్యే ప్రాజెక్టులు నిర్మించాలని డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌ను నిర్మించి ఉమ్మడి అనంతరం జిల్లాలో నిర్దేశించిన విధంగా 3.45లక్షల ఎకరాలకు నీరు అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం హంద్రీనీవా చీఫ్ ఇంజినీర్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఒపిడిఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసులు, జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతు సంఘ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సిపిఐ నాయకులు మల్లికార్జున, అఖిల భారత రైతు సంఘాల నాయకులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రైతు సంఘం నాయకులు కృష్ణ, ఐఎఫ్‌టియు నాయకులు సురేష్, యేసు, జల సాధన సమితి నాయకులు పెద్దన్న, వీరనారప్ప, చంద్ర, విద్యావంతుల వేదిక నాయకులు వెంకటేష్ నాయకులు నల్లప్ప పాల్గొన్నారు.



హంద్రీనీవా చీఫ్ ఇంజనీర్ ఆఫీస్ వద్ద ధర్నా చేస్తున్న జలసాధన సమితి నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం : ఎస్పీ

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండల వ్యాప్తంగా అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీ జగదీష్ పోలీసులను ఆదేశించారు. ఎస్పీ శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలిం చారు. పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకున్నారు. విలేకరులతో మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ పరికరాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకో వాలన్నారు. అసాంఘిక కార్యక్రమా లకు పాల్పడే వారిపై కఠినమైన చట్టాలు నమోదు చేయాలని తెలిపారు. ఎస్పీ వెంట ఎస్ఐ గౌస్, పోలీసులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

ఎంపి దృష్టికి వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలు

ప్రజాశక్తి-పామిడి

వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎపి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల కోదండరాంరెడ్డి ఆధ్వర్యంలో నగరం లోని ఎంపి నివాసంలో అంబికా లక్ష్మినారాయణకు వినతి పత్రం ఇచ్చారు. కోదండరామిరెడ్డి మాట్లాడుతూ 12వ పిఆర్సి అమలు ఆలస్యమైతే మధ్యంతర భృతి ఇచ్చేలా, మృతి చెందిన ఉద్యోగుల కుటుం బాలను ఆదుకునేలా, వారి సమస్యలు పరిష్కరించేలా సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.



ఎంపి అంబికాకు వినతి ఇస్తున్న కోదండరామిరెడ్డి

మెగా వెహికల్ సర్వీస్ మేళా

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

నగరంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల మైదానంలో శుక్రవారం జయలక్ష్మి మారుతి సుజుకీ యాజమాన్యం ఏర్పాటు చేసిన మెగా వెహికల్ సర్వీస్ మేళాను జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో మారుతీ సుజుకీ వారు వాహనదారులకు మంచి సేవలు అందిస్తున్నారని, భవిష్యత్తులో మరిన్ని సేవలు అందిచాలని ఆకాంక్షించారు. ఈ మేళాను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐటిఐ కాలేజీ ప్రిన్సిపల్, షోరూం నిర్వాహకులు పాల్గొన్నారు



మెగా వెహికల్ సర్వీస్‌మేళాను ప్రారంభిస్తున్న గిరిజమ్మ

సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

ప్రజాశక్తి-అనంతపురం రూరల్

రాప్తాడు నియోజకవర్గంలో 9 మందికి మంజూరైన రూ. 19,42,354 విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం నగరంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. వారిలో ఇందు(కుంటిమద్ది) రూ. 10,88,650, ఉప్పర సురేష్(కనగానపల్లి) రూ. 2,55, 525, నారా భార్గవ్ నాయుడు(మన్నీల) రూ. 1,50,284, కమ్మర రామాంజనేయులు (కందుకూరు) రూ. 1,59,222, లక్ష్మీదేవి(ఆత్మకూరు) రూ. 1,40,000, పెదరాపు తులసి(జంగాలపల్లి) రూ. 37,378, దూదేకుల మస్తానమ్మ(అయ్యవారిపల్లి) రూ. 46,295, నరసింహులు(ఆత్మకూరు) రూ. 50వేలు, కె.శ్రీలత(సనప) రూ. 15 వేలు చెక్కులు అందజేశారు.



సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే సునీత

ప్రీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని నందమూరి నగర్‌లో ఉన్న కల్వరి రివైవల్ చర్చిలో శుక్రవారం స్థానిక సంఘ కాపరి జహంగీర్ జాషువా అధ్యక్షతన ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ముఖ్య ప్రసంగికులుగా జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాస్టర్ రెడ్డివారి నెహెమ్యా నాగరాజు హాజరై బైబిల్ సందేశాన్ని వినిపించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చివరగా అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ రూఫస్ కుమార్, పాస్టర్ లాబాను సుధాకర్, పాస్టర్ సుధాకర్‌రెడ్డి, పాస్టర్ మల్లికార్జునపాల్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం తగదు : టిడిపి

ప్రజాశక్తి-శింగనమల

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీతో పాటు కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం తగదని టిడిపి నాయకులు తెలిపారు. స్థానిక ఆత్మారామస్వామి దేవాలయంలో శుక్రవారం వారు పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ఎమ్మెల్యే, సీనియర్ నాయకురాలు బండారు లీలావతిపైన గిట్టని వ్యక్తులు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సి.వెంకటేష్, పెద్ద నాగముని, ఆయకట్టు ప్రెసిడెంట్ గార్లదిన్నె సత్యనారా యణ, మాసూల చంద్ర పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-బెళుగుప్ప

విద్యార్థులు చదువుపై దృష్టి పెడితేనే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఉరవకొండ రూరల్ సిఐ చిన్నగౌస్ తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్ ఆవరణలో శుక్రవారం విద్యార్థులకు మహిళా చట్టాలు, సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సిఐ మహిళా చట్టాలు, చిన్నారుల రక్షణ చట్టాలు, సైబర్ మోసాలు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వివరిం చారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మీకు ఏ సాయం కావాలన్నా పోలీసు శాఖ తోడుగా ఉంటుందన్నారు. సమస్య ఉంటే 100, 112కు డయల్ చేస్తే తక్షణం స్పందించి రక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శివ, హెచ్‌ఎం వెంకటప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొ న్నారు.



సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న సిఐ చిన్నగౌస్

బీమా పథకాలపై అవగాహన

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలో 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ బీమా చేసుకొని ధీమాగా ఉండాలని ఇన్సూరెన్స్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ నరసింహారావు సూచించారు. మండలంలోని బుడిమేపల్లి, ఎస్.కోనాపురం గ్రామాల్లో శుక్రవారం జన సురక్షపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన పథకాలు, వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో బొమ్మగానిపల్లి కెనరా బ్యాంక్ మేనేజర్ ఓబులేష్, భూపసముద్రం ఎపిజిబి ఫీల్డ్ ఆఫీసర్ వెంకటేశులు, సర్పంచి వనితా మల్లికార్జున, ఎఫ్ఎల్‌సి విజయ్‌కుమార్, సిఎఫ్ఎల్ సిబ్బంది నారాయణ, వన్నూరుస్వామి, కామయ్య, మోహన్, వంశీకృష్ణ, సీసీలు కామరాజు, దొణతిమ్మప్ప, యానిమేటర్లు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్సూరెన్స్ లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ నరసింహారావు

23, 24న సిపిఎం జిల్లా మహాసభలు

ప్రజాశక్తి-అనంతపురం

ఈ నెల 23, 24 తేదీల్లో నగరంలో నిర్వహిస్తున్న సిపిఎం 14వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం రాప్తాడు ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో కందుకూరు గ్రామంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రాంతీయ కమిటీ కార్యదర్శి టి.రామాంజనేయులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల రద్దు, 2023 పంటల బీమా, పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలని, పిఎబిఆర్ కుడికాలువ ద్వారా చివరి ఆయకట్టు వరకూ సాగునీరు, 200 రోజుల ఉపాధి పనులు, రోజుకు రూ. 600 వేతనం, నిరుద్యోగ యువతకు ఉపాధి, భృతి, జాకీ పరిశ్రమను వెంటనే ప్రారంభించాలని, పారిశ్రామికవాడల్లో మౌలిక వసతులు, రైతులు, కౌలు రైతులు, పాడి రైతులను ఆదుకోవాలని, పదెకరాల వరకూ 90శాతం సబ్సిడీతో డ్రిప్పు, స్ప్రింక్లర్లు, అసంఘటిత రంగంలో కార్మికులకు సమగ్ర ఉపాధి చట్టం, స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాలు, నిరు పేదలకు 3 సెంట్ల ఇంటి స్థలం, ఇల్లు నిర్మాణం కోసం రూ. 10 లక్షలు ఇవ్వాలని, తదితర సమస్యలపై నగరంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగే బహిరంగ సభకు కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగ యువత, విద్యార్థులు, మహిళలు, వృత్తిదారులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ కమిటీ సభ్యులు పోతలయ్య, సుబ్బిరెడ్డి, ప్రతాప్, సుబ్బారావు, వెంకటేష్ వెంకటలక్ష్మి, నారాయణమ్మ సన్నక్క, ముత్యాలమ్మ, ఇంద్రమ్మ పాల్గొన్నారు.



సిపిఎం జిల్లా మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీవో-36 ప్రకారం వేతనాలు చెల్లించాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో శుక్రవారం మురళి అధ్యక్షతన జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల్లో ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై సదస్సు నిర్వహించారు. సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణ, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు సంజీవ రాయుడు, జుబేరు, నాగరాజు హాజరై మాట్లాడారు. మున్సిపాలిటీల్లో కార్మికులు 25 ఏళ్లుగా పని చేస్తున్నా కనీస వేతనం ఇవ్వకపోవడం దుర్మార్గం అన్నారు. చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణ భారమైందన్నారు. సెలవులు, టిఎ, డిఎ అమలు చేయకపోవడం, కార్మికులపై బెదిరింపులు, విధుల నుంచి తొలగించడం తగదన్నారు. ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, సంక్షేమ పథ కాలు అమలు కావడం లేదన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆయా సమస్యలను పరిష్కరిం చాలని, లేనిచో జనవరి 3వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. సదస్సులో అనంతపురం ఇంజినీరింగ్ అధ్యక్షులు ఓబుళపతి, ప్రధాన కార్యదర్శి మురళి, కోశాధికారి పోతలయ్య, నాయకులు లక్ష్మీదేవి, ధనలక్ష్మి, రామాంజనేయులు, రాజారవి, మహేష్, తిప్పేరుద్ర, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న సిఐటియు నాయకులు, మున్సిపల్ కార్మికులు

ఎంపిహెచ్ఎలను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-శింగనమల

పిహెచ్‌సిలకు ఆయువుపట్టుగా ఉన్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లను తక్షణమే విధుల్లోకి తీసు కోవాలని వైద్య ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని తరిమెల పిహెచ్‌సి ఆవరణలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు 'వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్లు కావాలి.. పిహెచ్‌సిలకు రావాలి' నినాదంతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ప్రజలకు తక్షణ సేవలు అందించడంలో, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో హెల్త్ అసిస్టెంట్ల పాత్ర కీలకమన్నారు. 22 ఏళ్లకు పైగా సేవలందించిన వారిని కోర్టు ఆదేశాలు సాకుగా చూపి ఉద్యోగాల నుంచి తొలగిం చడం అన్యాయమన్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.శంకర్‌నాయక్, సిబ్బంది అశ్వర్థనారాయణ, అప్సర్ బాను, నాగరాజు, హేమలత, ఆశా కార్యకర్తలు పెద్దక్క, రమాదేవి పాల్గొన్నారు.

ఉరవకొండ : విధుల నుంచి తొలగించిన మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ల(ఎంపిహెచ్ఎ)ను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని రాకెట్ల పిహెచ్‌సి సిబ్బంది డిమాండ్ చేశారు. ఈ మేరకు పిహెచ్‌సి ప్రాంగణంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో 'వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్లు కావాలి.. పిహెచ్‌సిలకు రావాలి' నినాదంతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ పావని, సిహెచ్ఒ నాగరంగయ్య, సిబ్బంది మౌనిక, శేఖర్, ఎస్తర్‌రాణి, కుమారిబాయి, మంగమ్మ, ఆశా కార్యకర్తలు సరస్వతి, శాంతాబాయి, తదితరులు పాల్గొన్నారు.



శింగనమలలో నిరసన తెలుపుతున్న పిహెచ్‌సి సిబ్బంది

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-గుత్తి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం పట్టణంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక గాంధీ కూడలి నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కెవిపిఎస్, సిపిఐ, బహుజన సమాజ్ పార్టీ, మాల సంఘం ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాలు నాయకులు పాల్గొని అమిత్‌షా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ర్యాలీలో కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, బీఎస్పీ జిల్లా నాయ కులు గద్దల నాగభూషణం, నాయకులు విజయ్, బండల రామాంజనేయులు, రామదాసు, నరసింహ య్య, రాజుయాదవ్, నజీర్, బాచి, అడవిరాముడు, బేల్దారి చంద్ర పాల్గొన్నారు.



గుత్తిలో నిరసన ర్యాలీ చేపట్టిన ప్రజా సంఘాల నాయకులు

పామిడి : పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలని ఎపి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి సాకే ఓబులేసు డిమాండ్ చేశాడు. ఓబులేసు మాట్లాడుతూ అమిత్‌షా పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అనాథలు, పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఆకలి బంధం సంస్థ సభ్యులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఉంటున్న నిరుపేదలు, అనాథలకు శుక్రవారం స్థానిక ఛేంజ్ ఫర్ సొసైటీ, ఆకలి బంధం సేవా సంస్థల ఆధ్వర్యంలో దుప్పట్లు, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, మార్కెట్, ఆలయాలు, రోడ్డు పక్కన ఫుట్‌పాత్‌పై పలువురు అనాథలు, నిరాశ్రయులు కొద్ది రోజులుగా చలికి ఇబ్బందులు పడుతుండగా గుర్తించిన ఆయా సేవా సంస్థలు దాతల సహకారంతో దుప్పట్లు సేకరించి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఛేంజ్ ఫర్ సొసైటీ మహిళా సభ్యులు భారతి, మహేశ్వరి, రోజా, అనిత, ఆకలి బంధం సేవా సంస్థ తరపున నాగయ్య, మారిష్, భర్తీక, వన్నూరుస్వామి, సురేష్, గంగాధర్, శ్రీరామ్ ఫౌండేషన్ అనూష, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కొనుగోళ్లపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-రాయదుర్గం

ఆన్‌లైన్ కొనుగోళ్ల విషయంలో కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వినియోగ దారుల సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు సూచించారు. ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకూ జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం డి.హీరేహాల్ మండలంలోని పులకుర్తి గ్రామ జడ్పీ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆన్‌లైన్ కొనుగోళ్లలో నాణ్యతా లోపాలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ముఖ్య అతిథి, మండల వినియోగదారుల సంఘం అధ్యక్షులు గౌరా సత్యనారాయణ వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు ఓబుళపతి కల్తీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ బసవరాజు, సర్పంచి దోనప్ప, ఉపాధ్యాయులు జ్యోతిర్మయి, స్వామినాథ్‌రెడ్డి, జ్యోత్స్న, ముతమ్మల్, ఓబులేసు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్టిఫికేషన్ కోర్సులతో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-శింగనమల

బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురం ఉన్న ఎస్ఆర్ ఐటి కళాశాలలో శుక్రవారం ఐసిటి అకాడమీ ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ ఆన్ క్లౌడ్ ప్రాక్టి షనర్ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఇందులో జిల్లాలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు. సయనాడ్ కమరన్ ఐసిటి అకాడమీ నుంచి రీసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించటానికి ఇలాంటి సర్టిఫికేషన్ కోర్సులు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.బాలకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ యు.శ్రీనివాసులు, వీరప్రకాష్, హేమంత్‌కుమార్‌యాదవ్, చిత్రలింగప్ప, రాజేష్ బాబు, నగేష్, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఓపెన్ ఫోరంలో 4 అర్జీలు

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రతి శుక్రవారం పట్టణ ప్రణాళిక విభాగం నిర్వహించే ఓపెన్ ఫోరంను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి సూచించారు. మున్సిపల్ కార్యాలయం లోని పట్టణ ప్రణాళిక విభాగంలో శుక్రవారం ఓపెన్ ఫోరం నిర్వహించగా 4 అర్జీలు అందాయి. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని టిపిఎస్ మురళీమోహన్ తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో ప్రణాళిక విభాగానికి సంబంధించి సమస్యలు, సందేహాలు ఉంటే ఓపెన్ ఫోరంలో ఫిర్యాదు చేయవ చ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రణాళిక విభాగం కార్యదర్శులు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, లైసెన్స్ ఇంజి నీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

సైనికుల పిల్లలకు ఉచితంగా మందులు

ప్రజాశక్తి-నార్పల

దేశ సేవలో భాగంగా విధి నిర్వహణలో అసువులు బాసిన వీర జవాన్ సుబ్బయ్య భార్య, పిల్లలతో పాటు దేశ సేవలో ఉన్న సైనికుల పిల్లలు వారి గుర్తింపు కార్డు చూపిస్తే తమ మెడికల్ స్టోర్‌లో మందులు ఉచితంగా ఇస్తామని స్థానిక వెంకటేశ్వర మెడికల్ స్టోర్ నిర్వాహకులు బింగి విజయ్ తెలిపారు. బింగి విజయ్ నిర్ణయం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంట మార్పిడితో తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులు పంట మార్పిడి చేయడం ద్వారా తెగుళ్లను నివారించడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో శుభకర్ తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రం పరిధిలోని పప్పుసెనగ పొలాలను శుక్రవారం ఆయన సందర్శించి తెగుళ్ల నివారణకు మందులను సూచించారు. అలాగే ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమా యోజన గడువును ఈ నెల 31వ తేదీ వరకూ పొడిగించారని తెలిపారు. పప్పుసెనగ, జొన్న, మామిడి, టమాటా సాగు చేసిన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రంలో ప్రీమియంను చెల్లించాలని తెలిపారు. ఆయన వెంట సెరికల్చర్ అసిస్టెంట్ లక్ష్మీదేవి, రైతులు రఘునాథ్, రామన్న, నాగరాజు ఉన్నారు.

రెవెన్యూ, సర్వే అంశాలపై ఆర్డీవో సమీక్ష

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఆర్డీవో జి.వసంతబాబు శుక్రవారం డివిజన్ పరిధిలోని కుందుర్పి మండల తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్, సీనియర్ అసిస్టెంట్, విఆర్‌ఒలు, విలేజ్ సర్వేయర్లతో స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, సర్వే సంబంధిత అంశాలపై సమీక్షించారు.

26న మండల సమావేశం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో ఈ నెల 26వ తేదీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రామచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్పీటీసీ, మండల స్థాయి అధికారులు హాజరవ్వాలన్నారు.

ఫిబ్రవరిలో సునామ జకనీ మాత ఉత్సవాలు

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని అరే కటికల ఆరాధ్య దైవం సునామ జకినీ మాత ఆలయంలో ఫిబ్రవరి 6, 7 తేదీల్లో నిర్వహించే ఉత్సవాలను విజయవం తం చేయాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆలూరు లక్ష్మణరావు పిలుపునిచ్చారు. గుత్తి ఆర్ఎస్ రోడ్డులోని ఆలయంలో శుక్రవారం నిర్వహించిన కమిటీ సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ ఉత్సవాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. అనంతరం జకనీ మాత ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు.

పెదవి చీలిక, గ్రహణమొర్రి బాధితులకు వైద్య సేవలు

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్రీయ బాల స్వస్థ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని జిల్లా త్వరిత చికిత్స కేంద్రంలో సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్.వెంకటేశ్వరరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవి, జిల్లా పర్యవేక్షణ అధికారి డాక్టర్ జి.నారాయణస్వామి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎవిఆర్ హాస్పిటల్ సహకారంతో పెదవి చీలిక, గ్రహణమొర్రి బాధిత పిల్లలకు వైద్య సేవలు అందించారు. సర్జన్లు డాక్టర్ ఎ.విజయ్ కుమార్, డాక్టర్ యశస్విని స్క్రీనింగ్ చేసి అవసరమైన పిల్లలను శస్త్ర చికిత్సకు సిఫారసు చేశారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీవిద్య, మేనేజర్ రజిత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్, డెంటల్ డాక్టర్ ముత్యాలమ్మ, సోషల్ వర్కర్ రాజేశ్వరి, డిఈఐసి సిబ్బంది పాల్గొన్నారు. సాయి ట్రస్ట్ వారు ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్, బైక్ ఢీ.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బెళుగుప్ప

వరిగడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని నక్కలపల్లి భీమిరెడ్డి తోట సమీపంలో చోటుచేసుకుంది. ఎస్ఐ శివ తెలిపిన వివరాలు.. మండలంలోని శ్రీరంగపురం గ్రామానికి చెందిన హరిజన తిమ్మరాజు(51) బెళుగుప్ప వెళ్లి పని ముగించుకొని తిరిగి బైక్‌పై స్వగ్రామం బయల్దేరాడు. అతడు నక్కలపల్లి భీమిరెడ్డి తోట సమీపం లో వెళ్తుండగా గుండ్లపల్లి నుంచి వరిగడ్డి లోడుతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు మృతి చెందడంతో ఇక తమకు దిక్కెవరని వారు బోరున విలపించారు. హరిజన కళావతి మరిది శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని కళ్యాణ దుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-గుత్తి

గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహశీల్దార్ డి.ఓబులేసు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు.సదస్సులో మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా, తొండపాడు ఆలయ ఈఓ కురుబ నాగేంద్రుడు, వీఆర్వోలు వెంకటరాముడు, టి.సురేంద్ర, రఫీ, కిషోర్, సుధాకర్‌రెడ్డి, పక్కీరప్ప, వీఆర్ఏలు సుధాకర్, యుగంధర్ పాల్గొన్నారు.

పుట్లూరు : మండలంలోని చెర్లోపల్లి రెవెన్యూ గ్రామంలో నిర్వహించిన సదస్సులో 5 అర్జీలు అందినట్లు తహశీల్దార్ శేషారెడ్డి తెలిపారు. రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని తహశీల్దార్ తెలిపారు. సదస్సులో మండల సర్వేయర్ శాంతి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కెజిబివి స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

స్థానిక కెజిబివి ముందు ఉన్న స్థలం ఆక్రమణపై కెజిబివి ఎస్ఎంసి ఛైర్‌పర్సన్ సుశీల, ఎస్ఒ మహాలక్ష్మి, తదితరులు శుక్రవారం తహశీల్దార్ సుమతి, ఎంపిడిఒ నందకిశోర్‌లకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కొందరు వ్యక్తులు పాఠశాల ముందు ఉన్న స్థలంతో పాటు చెరువు ఆయకట్టు భూములను ఆక్రమించుకున్నార న్నారు. చెరువులో నుంచి బ్రహ్మసముద్రం గ్రామంతో పాటు కెజిబివికి తాగునీటి పైపులైన్ వేయగా దానిపైనే నిర్మాణాలు చేపట్టేందుకు జెసిబితో తవ్వుతుండగా పైపులైన్ పగిలిపోయిందని వివరించారు. తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ సుమతి, విఆర్ఒ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్తామ న్నారు. ఫిర్యాదు చేసిన వారిలో నాయకులు పరమేష్, ఆయకట్టు అధ్యక్షురాలు సాకమ్మ, తిప్పేస్వామి, గోవిందు, ప్రభాకర్, శివలింగ, జయన్న, కుళ్లాయప్ప, నాగరాజు, కమిటీ సభ్యులు ఉన్నారు.

కులం పేరుతో దూషణలు... చర్యలకు డిమాండ్...

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండలంలోని కల్లూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అర్జీ ఇవ్వడానికి వెళ్లిన తనపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు కులం పేరుతో దూషించిన కల్లూరుకు చెందిన టిడిపి కార్యకర్త సామల మధుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు తహశీల్దార్ ఈరమ్మకు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ మధు రెవెన్యూ అధికారుల సమక్షంలోనే తనను నువ్వు ఎవరు.. మా గ్రామానికి వచ్చి అర్జీ ఇవ్వడానికి అని బెదిరించడంతో పాటు కులం పేరుతో దూషించాడని, అతడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ నమోదు చేయాలని కోరాడు. ఆయనతో పాటు సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాయకులు ఉన్నారు.

విద్యుత్‌ను ఆదా చేద్దాం : డీఈఈ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

విద్యుత్‌ను ఆదా చేద్దాం.. భావితరాలకు భరోసానిద్దాం అని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వి. గురురాజు పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి టి సర్కిల్ వరకూ డీఈఈ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్రీ స్టార్ గృహోపకరణాలు వాడుదాం.. 30శాతం విద్యుత్‌ను ఆదా చేద్దాం.. అన్నారు. విద్యుత్ పొదుపు అనేది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. విద్యుత్‌ను అనవసరంగా విచ్చలవిడిగా వాడితే భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. ర్యాలీలో శివలింగేశ్వరయ్య, సికె. నాగేంద్ర, గోపి, అనిల్‌బాబు, ఫణిశేఖర్, రాజశేఖర్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీ చేపట్టిన డీఈఈ, ఉద్యోగులు